# ఆనంద ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, మొగల్తూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 30.03.2017న జరిగిన ప్రమాదంపై

## శ్రీ కింజారపు అచ్చెన్నాయుడు (కార్మిక & ఉపాధి, ఫ్యాక్టరీస్, యువజన & క్రీడల, నైపుణ్యాభివృద్ధి మరియు స్వయం ఉపాధి శాఖామాత్యులు)గారి ప్రకటన

1. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులోని మెస్సర్స్ ఆనంద్ ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 30.03.2017 ఉదయం 9.30 గంటలకు పారిశ్రామిక ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో 5గురు కార్మికులు మరణించారు.
2. మెస్సర్స్ ఆనంద్ ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనేది ఒక రొయ్యల శుద్ధి జరిపే యూనిట్. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం నల్లంవారితోట లోని ఆర్‌ఎస్ నెం.828, 872/2లో దీనిని నెలకొల్పారు.
3. ఈ పరిశ్రమ ఏర్పాటుకు ఆమోదం ఏప్రిల్ 2014న ఇచ్చారు. సంస్థ కార్యకలాపాలు మే 2014 నుంచి ప్రారంభమయ్యాయి.
4. రోజుకు 10 టన్నుల రొయ్యలు ప్రాసెస్ చేసేందుకు 31.05.2025 వరకు చెల్లుబాటు అయ్యేలా అన్ని కార్యకలాపాలు సాగించేందుకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈ పరిశ్రమకు అనుమతి ఇచ్చింది. ఈ పరిశ్రమ ఆరెంజ్ కేటగిరి ఇండస్ట్రీ కిందకు వస్తుంది.
5. ఈ పరిశ్రమలో ప్రస్తుతం రొయ్యల తలలు తొలగించి, ప్యాకింగ్ చేసి మరింత శుద్ధి చేసే నిమిత్తం వాటిని ఇతర యూనిట్లకు పంపడం జరుగుతోంది. ఈ ప్రక్రియలో రొయ్యలను పరిశుభ్రం చేసేందుకు సదరు పరిశ్రమ రోజుకు 42 కిలో లీటర్ల నీటిని వినియోగిస్తుంది. ప్రతిరోజూ విడుదలయ్యే 40 కిలో లీటర్ల వృధా నీటిని మొదట వ్యర్థాల సేకరణ ట్యాంకులోకి పంపించి తరువాత ఎఫ్లుయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోకి పంపింగ్ చేస్తారు.
6. ఎఫ్లుయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో కలెక్షన్ ట్యాంక్, ఏరేషన్ ట్యాంక్, క్లారిఫయర్, స్లడ్జ్ డ్రయింగ్ బెడ్స్, బఫర్ ట్యాంక్, శాండ్ ఫిల్టర్, స్టోరేజి పాండ్ వంటివి ఉంటాయి. శుద్ధిచేసిన ఈ నీటిని పరిశ్రమ పొరుగునే ఉన్న యాజమాన్యం వారి భూములలో మొక్కల పెంపకానికి సేద్యపు నీటిగా వినియోగిస్తారు.
7. పొల్యూషన్ కంట్రోల్‌బోర్డుకు చెందిన టాస్క్‌ఫోర్స్ కమిటి 09.12.2016న ఈ పరిశ్రమ గురించి సమీక్ష జరిపింది. ఇటిపి ఎవల్యూయేషన్, ఫ్లో మీటర్ల ఏర్పాటు, గొంతేరు డ్రయిన్‌కు దారితీసే పైప్‌లైన్లను తొలగించడం తదితర నిర్దిష్టమైన సూచనలను 12.01.2017న ఈ పరిశ్రమ యాజమాన్యానికి సూచించింది.
8. గొంతేరు డ్రెయిన్‌కు దారితీసే పైప్‌లైన్‌లను ఇప్పటికే తొలగించారు. ఇతర సూచనల అమలును పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది.
9. 30.03.2017న వ్యర్థాల కలెక్షన్ ట్యాంకులో నిర్వహణ పనుల నిమిత్తం ఐదుగురు కూలీలు వెళ్లి మృతిచెందారు.
10. ఈ కలెక్షన్ ట్యాంకు పరిమాణం 12.5మీటరు×4మీ.×4మీ. (200కిలో లీటర్లు)
11. రొయ్యల శుద్ధి పరిశ్రమకు వంద మీటర్ల దూరంలో వ్యర్థాలను కలెక్షన్ ట్యాంకులోకి సేకరించి తరువాత వాటిని అదే పరిసరాల్లో ఉన్న ఎఫ్లుయంట్ ట్రీట్‌మెంట్ సిస్టమ్‌లోకి పంపింగ్ చేస్తారు.

12. వ్యర్థాల కలెక్షన్ ట్యాంకును జిఐ షీట్లతో కవర్ చేశారు. ఎప్పుడు అవసరమైతే అప్పుడు దీని నిర్వహణ పనులు చేపట్టేందుకు వీలుగా ఒక మ్యాన్ హోల్ వంటి వ్యవస్థ ఇందులో ఉంటుంది.

13. ప్రమాదం జరిగిన రోజున కలెక్షన్ ట్యాంకు నుంచి వ్యర్థాలను ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ సిస్టమ్‌లోకి తీసుకువెళ్ళే పైప్‌లైన్ ఫుట్ వాల్వ్ బ్లాక్ అయిందని చెబుతున్నారు. దీనికి మరమ్మత్తులు చేయడానికి వెళ్ళిన 5గురు కార్మికులు మృతి చెందారు.

14. పోస్టుమార్టమ్ నివేదిక అందిన తరువాత వీరి మృతికి కచ్చితమైన కారణాలు తెలుస్తాయి.

15. **మృతుల వివరాలు :**

| | | | |
|---|---|---|---|
| బొడ్డు రాంబాబు | (21), | అవివాహితుడు | - కె.పి.పాలెం |
| నల్లం ఏడుకొండలు | (22), | అవివాహితుడు | - నల్లంవారి తోట |
| జక్కంశెట్టి ప్రవీణ్ | (22), | అవివాహితుడు | - కాళీపట్నం. |
| తోట శ్రీనివాస్ | (25), | అవివాహితుడు | - మొగల్తూరు |
| ఈదా ఏడుకొండలు | (25), | వివాహితుడు | - సీతారాంపురం |

16. ప్రమాదం గురించిన వార్త తెలిసిన వెంటనే జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శ్రీ అయ్యన్నపాత్రుడు మరియు ఇతర మంత్రులు శ్రీమతి పీతల సుజాత, శ్రీ పైడికొండల మాణిక్యాలరావు సంఘటనా స్థలానికి హుటాహుటిన వెళ్ళి పరిస్థితిని సమీక్షించారు.

17. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు ఈ సంఘటనపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

18. 5. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్ గ్రేషియా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. చంద్రన్న బీమా కింద రూ.5లక్షలు, సీఎం రిలీఫ్ పండ్ కింద రూ.5 లక్షలు, ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి రూ.15 లక్షలు ఇందులో ఉంటాయి.

19. సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.5 లక్షలు నిన్ననే (గురువారం) బాధిత కుటుంబాలకు అందజేయడం జరిగింది.

20. ఈ విషయంపై పోలీసులు కేసును నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఎంత పెద్దవారైనా దోషులుగా తేలితే ఉపేక్షించేది లేదు.

21. ఈ విషయంపై మేజిస్టీరియల్ ఎంక్వైరీని నిర్వహించడానికి ప్రభుత్వం నిశ్చయించింది. ఆక్వా ఇండస్ట్రీలో కార్మికుల రక్షణ కోసం తగు సూచనలు చేసి భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండడానికి కావలసిన చర్యలను సూచించడానికి ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి అధ్యక్షతన నిపుణుల కమిటీని నియమించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది.

**కింజారపు అచ్చెన్నాయుడు**

కార్మిక & ఉపాధి, ఫ్యాక్టరీస్, యువజన

& క్రీడల, నైపుణ్యాభివృద్ధి మరియు

స్వయం ఉపాధి శాఖామాత్యులు